## కథ

# సృష్టిని ఆపకండి

రత్నాకరం కూర్మారావు

అమ్మాయే పుడుతుంది అచ్చం నాన్నలానే ఉంటుంది. ఉహుఁ కాదు.... కాదు, అబ్బాయే పుడతాడు అచ్చం అమ్మలానే ఉంటాడు. అంటూ భార్యపోలికల్లో ఉన్న అబ్బాయి కావాలని భర్త, భర్తపోలికల్లో ఉన్న అమ్మాయి కావాలని భార్య, కలలుగంటూ ప్రతిరాత్రి పున్నమిరాత్రిగా చేసుకుని, తమ కలలను పండించుకుని తమ ఇద్దరి ప్రేమకు ఫలితాన్ని అందుకోవాలని ఎంతో ఆశగా జీవితాన్ని గడుపుతుంటారు క్రొత్తదంపతులు. వివాహమై ఆర్నెల్లు దాటీదాటకముందే తమ ప్రేమకు చిహ్నంగా నిలిచే సంతానం కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తుంటారు. తమకి అమ్మా నాన్నలుగా ఊహించుకుంటేనే అదొక రకమైన పులకింత కలుగుతుంది వారిలో.

స్వప్న, సుధీరుల వివాహమై ఒక ఏడాది గడిచింది. పెద్దలు కుదిర్చిన సంబంధమే అయినా పెళ్ళిచూపుల సమయంలో వారి చూపులు కలిసాయి. మనసులు కలిసాయి. అప్పుడే వారిలో ప్రేమ అంకురించింది. కానీ పెద్దలు మాత్రం మరో వారంలో ఏవిషయం తెలియజేస్తామని ఇంటికి వచ్చారు. తరువాత మరో సంబంధం వచ్చింది. ఇంతకుముందు చూసిన అమ్మాయి కంటే ఈ అమ్మాయి బాగుంది. పెట్టుపోతల విషయంలో కూడా వీరు కాస్త ముందే ఉండటాన సుధీర్ తల్లి దండ్రులు రెండోసారి వచ్చిన సంబంధం వైపే మొగ్గుచూపారు. అప్పుడది స్వప్నకి తెలిసి సుధీర్‌కి ఫోన్ చేసి చాలా బాధపడింది. సుధీర్‌కి కూడా ఆమెపై గాఢంగా ప్రేమ ఉండటాన ఆమె పడే బాధ విని తట్టుకోలేకపోయాడు. అదనంగా ఎన్ని హోదాలు కల్పించినా తనభార్య స్థానంలో మరొకరిని ఊహించుకోలేకపోయాడు. దానికి పర్యవసానమే తల్లిదండ్రులతో పోరాడి పట్టుపట్టి మరీ స్వప్నని తనదానిగా చేసుకున్నాడు. పెళ్ళయి ఏడాదే అయినా ఏడేడు జన్మల బంధంలా పెనవేసుకుపోయింది వారి కల్మషంలేని ప్రేమ. చేసుకున్న తరువాత సుధీర్ అమ్మా నాన్నలు. వెంకట్రామయ్య, యశోదలు, పిన్నీ, బాబాయిలు సుందరరామయ్య, సుగుణాలు కూడా స్వప్నని ఎంతో ప్రేమగా చూసుకుంటున్నారు.

సుధీర్ బాబాయికి పిల్లలు లేకపోవడాన వాళ్ళు కూడా అన్న వెంకట్రామయ్య దగ్గర వ్యవసాయ పనులు చూసుకుంటూ సుధీర్‌ని కన్నకొడుకుగా భావించి ఇక్కడే ఉంటున్నారు. అందువల్ల అందరూ సుధీరుకి కలగబోయే సంతానం కోసం ఎదురు చూస్తున్నారు. వారిఎదురు చూపులకే చాలింత అయిందా అన్నట్లు స్వప్నకి ఈ నెల నెలసరి రాలేదు ఇక ఆ కుటుంబ సంతోషం పట్టరానిదే అయింది.

ఇద్దరత్తగార్లు స్వప్నని కాలుకింద పెట్టనివ్వడంలేదు. లేస్తే చాలు లేవకు.. లేవకు... ఏం కావాలన్నా మమ్మల్ని పిలవమని చెప్పామా అంటూ పరుగెత్తుకొస్తున్నారు. ఏం లేదండీ బాత్రూముకి వెళ్దామని అంటూ చిన్నగా గొణిగే స్వప్నని చెరోచెయ్యి పట్టుకుని బాత్రూము వరకు వెళ్ళటంతో అపురూపమైంది స్వప్న జీవన విధానం. కోడలు అనుమతిస్తే బాత్రూములోకి కూడా వెళ్ళేంతగా ప్రేమని పంచుతున్నారు వారు. ఆరోజు మంచిరోజని స్వప్నని డాక్టరుకి చూపించడానికి హాస్పటల్‌కి బయలుదేరారు వారు. పెళ్ళి శుభలేఖల్లో అచ్చు వేసినట్లు సకుటుంబ సపరివారంగా స్వప్న భర్త, మామగార్లు, అత్తగార్లు, పనివారు అందరూ బయలుదేరారు, రెండు ఆటోల్లో. హాస్పటల్లో అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. తమవంతు వచ్చేసరికి ఒకగంట పట్టవచ్చని చెప్తే కుర్చీల్లో కూర్చుని లోకాభిరామాయణం మొదలుపెట్టారు. పనివాళ్ళు గంగమ్మ, సుబ్బడు బైటకి వెళ్ళి వస్తామనిచెప్పి వెళ్ళారు.

ఒక అరగంట గడిచింది. ఆపరేషన్ థియేటర్‌నుండి డాక్టర్ బలిచక్రి ఓపీకి వచ్చాడు. ముందుగా వున్న నెంబర్లు అయిదారు చూసిన తరువాత స్వప్నని లోపలికి పిలిచారు. పావుగంట గడిచింది. కాంపౌండర్ బైటకి వచ్చి సుధీర్‌గారు ఎవరు? డాక్టరుగారు పిలుస్తున్నారు అని చెప్పాడు. నేనే నంటూ సుధీర్ లోపలికి బయలుదేరాడు. వెంట వెంకట్రామయ్య గారు కూడా బయలుదేరారు. తండ్రి రావడం చూసిన సుధీర్ 'నువ్వెందుకు నాన్నా నేను వెళ్ళి వస్తాగా' అన్నాడు. 'మాట్లాడక పదరా! డాక్టరుగారు పిలిచారంటే ఏదో విశేషం వుండే వుంటుంది. వెళ్దాం పద' అంటూ సుధీర్ వెనకాలే ఎగ్జామినేషన్ రూములోకి వెళ్ళారు

వెంకట్రామయ్యగారు. వాళ్ళిద్దర్నీ చూసిన డాక్టర్ బలిచక్రి మీరెవరు అని అడిగాడు వెంకట్రామయ్య గారిని చూస్తూ. నేనా నేను ఇదుగో ఈ సుధీర్‌కి నాన్నని, ఈ అమ్మాయికి మావగారిని. ఏం ఫర్లేదు. మీరు చెప్పదల్చుకున్నదేదో చెప్పండి అన్నారు డాక్టరుగారిని చూస్తూ వెంకట్రామయ్యగారు.

ఆ మాటవిని కుర్చీలోనుండి లేచిన డాక్టర్ బలిచక్రి 'ఆఁహే ఏం లేదు. అర్థం చేసుకుంటే ఇది చాలా చిన్న విషయమే. భూతద్దంలో చూసి గాభరా పడకండి. ఇప్పుడూ మన కళ్ళకి కనిపించని ప్రాణంకోసం, ఎదురుగా కనిపించే ప్రాణానికి ముప్పు కలుగుతుంది అంటే దాన్ని ఆపటానికి తగిన చర్య తీసుకుంటామా! లేదా?' వెంకట్రామయ్య గారిని చూస్తూ అడిగాడు డాక్టర్ బలిచక్రి.

'పెద్ద ప్రాణాన్ని కాపాడటానికే ప్రయత్నిస్తాం దాంట్లో సందేహమేముంది' అన్నాడు వెంకట్రామయ్యగారు.

ఈ రోజుల్లో పిల్లల్దేముంది. ఏ మురిక్కాలవల్లో చూసినా... ఏ చెత్తకుండీలల్లో చూసినా నిస్సహాయంగా ఏడుస్తూ అమ్మవడికోసం అలమటించే పసికందులు కోకొల్లలు. ఏ పసిగుడ్డును వడి చేర్చుకున్నా ఆ సొత్తు మనదే అవుతుంది. పైగా పదినెలలు మోసే బాధలేకుండా... పురిటినెప్పులతో కష్టపడకుండా మన జీవితాల్లోకి ఒక జీవి వస్తుంది. అందరికీ ఆనందం పంచుతుంది. ఇంకా ఏదో చెప్పబోతున్న డాక్టర్ బలిచక్రీ మాటలకి అడ్డువస్తూ...

'అది సరే డాక్టరుగారూ, మా కోడలు నెల తప్పిందని పరీక్ష చేయమని వస్తే మీరేదో చెప్తున్నారు. అసలు దానికీ దీనికీ పొంతనేమిటి? టెన్షన్ పెట్టక అసలు విషయం చెప్పండి సార్' అన్నారు. వెంకట్రామయ్యగారు.

అసలు విషయమేనండి నే చెప్పేది. కాకపోతే మీరు తట్టుకోవడానికి వీలుగా ఆ సమస్యని మలిచి చెప్పుకొస్తున్నాను. అసలు విషయం చెప్తున్నాను వినండి. మీ కోడలు మీకు మనవణ్ణి ఇస్తుందని ఎంతో సంతోషపడి పోతున్నారు. కానీ చెప్పక తప్పదు. మీకు మనవడు కావాలని గర్భాన్ని పెరగనిస్తే పసి ప్రాణాలతో పాటు పెద్దప్రాణానికి కూడా ముప్పు రావచ్చు. ఎందుకంటే ఇప్పుడిప్పుడే గర్భసంచీ క్యాన్సరు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పుడు గనుక అబార్షనుతోబాటు గర్భసంచిని తొలగిస్తే పెద్ద ప్రాణానికి ఏ ముప్పూ ఉండదు. జబ్బుకి వయసుతో సంబంధం ఉండదు. మీ కోడలు వయసే 24 ఏళ్ళు ఉంటాయేమో! నలుగురికి ఇలాంటి సమస్యే వస్తే గర్భసంచిని తొలగించమని ధైర్యంగా ముందుకి వచ్చారు. ఇప్పుడే ఆ నలుగురికీ గర్భసంచిని తొలగింపు శస్త్ర చికిత్స(హిస్టారెక్టమీ) చేసి వస్తున్నాను. వాళ్ళందరూ పిల్లలకన్నా పెద్ద ప్రాణానికే ఎక్కువ విలువ నిచ్చారు. కనుక మీరు కూడా బైటకి వెళ్ళి మీరూ మీరూ సంప్రదించుకుని ఒక నిర్ణయానికి వచ్చి ఒక గంటలో నాకు చెప్పండి. ఇక ఆ తరువాత అయితే ఒక వారం వరకు నాకు కుదరదు. వేరే వూరు క్యాంపుకి వెళ్ళాల్సిన వని ఉంది. అందుకని వెళ్ళండి. వెళ్ళి ఆలోచించుకోండి. ఈలోగా మిగతా పేషంట్సుని చూస్తాను' అన్నాడు డాక్టర్ బలిచక్రి.

డాక్టరుగారి మాటలు వినే సరికి గుండె ఆగినంత పని అయింది అక్కడున్న వారికి. స్వప్న కళ్ళవెంట నీళ్ళు వరదలే అయినాయి. సుధీర్ భార్యవంక జాలిగాను, బాధగాను చూసాడు. వెంకట్రామయ్య గారు మాత్రం వారి వంక అదో రకమైన చూపొకటి చూసి ఇకబైటకి పదండి అంటూ తలుపుతీసుకుని బైటకి వచ్చారు.

విషయాన్నంతా పూస గుచ్చినట్లు బైట వున్న మిగతా వారికి చెప్పారు వెంకట్రామయ్య గారు. అదివిన్న ఏ ఒక్కరికీ నోటమాట రాలేదు. చైతన్యం కోల్పోయి క్షణం బిగుసుకు పోయారు. ఆ తరువాత కాస్త తేరుకున్న యశోద అయ్యో ఎంతపని జరిగింది కోడలు వంశాంకురాన్ని చేతుల్లో పెడుతుందని ఎంతో ఆశపడ్డాం. కానీ కాలూ, చేయీ ఆడకుండా ఉండే కబురు వినిపించింది. అంటూ కళ్ళు ఒత్తుకున్నారు. నిజమేనక్కా నేను కూడా ఎంతో సంబర పడిపోయాను. మన రెండు కుటుంబాలకి వారసుడు సుధీర్ ఒక్కడు. ఇప్పుడు వాడివలన కోడలి కడుపున నాలుగు కాయలు కాస్తే వాళ్ళని పెంచుతూ వారి బోసినవ్వులకి మురిసిపోతూ... వారి చిలక పలుకులకు మైమరిచిపోతూ ఆనందిద్దామనుకున్నాను! ఇదేమిటక్కా ఇలా జరిగింది, మనం ఏ పాపం చేసామొ ఏమో, పోనీ ఈ సారి కాకపోతే మరోసారి అనుకుందామన్నా... అసలు ఆ అవకాశమే లేదంటున్నారాయె! ఏకంగా గర్భసంచే కోసి పారేస్తాము లేకపోతే ప్రమాదం అమటున్నాయాయె! ఇప్పుడు మనం ఏం చేయాలి! కింకర్తవ్యం"ఒక సంస్కృత పదాన్ని బైటకి వదలి. ఒక నిట్టూర్పుని విడిచింది సుగుణ.-

ఇక చేసేదేముంది, ఈ వంశం ఇంతటితో అంతరించిపోతే మనకి పిండం పెట్టేవారు అంతమాట అనకండి ఇప్పటికే స్వప్న సగం కుంగిపోయింది. ఇలాంటి మాటలువింటే నిలువునా కూలిపోతుంది. దానిమొహం చూసైనా కాస్త శాంతించండి. ఇంకేదైనా దారి వుందేమొ మళ్ళీ డాక్టరుగారిని అడుగుదాం అన్నారు స్వప్న తండ్రి ఆనందరావు. కూతురి దుఃఖం చూసి స్వప్న తల్లి లీలావతికి గుండె చెరువే అయింది. కూతుర్ని అక్కున చేర్చుకుని కన్నీరు పెట్టుకుంది. అక్కడున్నవారందరూ ఎవరికి తోచిన సలహావారు ఉచితంగా ఇస్తున్నారు. కానీ అందరు చెప్పిన సలహాల్లోని సారాంశం మాత్రం సుధీర్‌కి మారుమనువు చేయడమేనని తెలుస్తున్నది.

కానీ సుధీర్ మాత్రం స్వప్న పడేబాధ, స్వప్నా వాళ్ళ తల్లిదండ్రులు పడే ఆవేదన చూసి చలించి పోయాడు. కూతురికాపురం కూలిపోతుంటే ఏ తల్లిదండ్రులు



జూలై 31న మచిలీపట్నంలో నేటినిజం సంపాదకులు బైస దేవదాసుకు కోపల్లె హనుమంతరావు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న మాజీమంత్రి మండలి బుద్ధప్రసాద్, కొల్లూరి కోటేశ్వరరావు, డా॥రావి రంగారావు, గుత్తికొండ సుబ్బారావు

తల్లడిల్లిపోరు అనుకున్నాడు. అందునా సుధీర్‌కి స్వప్న అంటే ఎంతో ప్రేమ. ప్రేమ ఎప్పుడూ త్యాగాన్నే కోరుకుంటుంది. ఆ త్యాగమే సుధీర్ చేత ఈ మాటలు మాట్లాడించింది.

'నాన్న నాకు మరో పెళ్ళి ఆలోచన మానుకోండి, మరోదారి ఏదైనా వుందేమో మళ్లీ డాక్టరుగారిని అడిగి చూద్దాం, లేకుంటే ఎవరినైనా తెచ్చి పెంచుకుందాం. అంతేగానీ పెళ్ళీ, పేరంటం అనేమాట అనకండి. స్వప్న చూడండి ఎంత బాధ పడుతుందో . పిల్లల్ని కనే అవకాశం లేదని ఆమెను నడిసముద్రంలోకి నెట్టేస్తామా! అదే మన అమ్మాయి అయితే ఇలాంటి పరిస్థితికి ఎంత బాధ అనుభవించేవాళ్లం' అన్నాడు సుధీర్.

'అలా వీల్లేదురా. నీ వల్ల ఈ ఇంట్లో నలుగురు పిల్లలు నట్టింట్లో నడయాడాలి. మన వంశం అభివృద్ధి చెందాలి. లేకుంటే నాకు మా బాబాయికి మనశ్శాంతి కరువవుతుంది. నువ్వు ఎన్నైనా చెప్పు. మా నిర్ణయం మారదు అన్నారు వెంకట్రామయ్యగారు.

'సుధీర్ నువ్వేమీ బాధపడకు. మరో అమ్మాయితో నీకు వివాహమైనా స్వప్న మనింట్లోనే ఉండవచ్చు. నీకు కలిగే పిల్లలే ఆమెకూ పిల్లలౌతారు? ఎంతో ఉదార స్వభావాన్ని వెల్లడించారు సుందర రామయ్యగారు.

'అలా అనకండి అన్నయ్యగారు. అల్లుడుగారి పిల్లలు దానికి పిల్లలు కావచ్చు ఎందుకంటే పాపం, పుణ్యం తెలియని పసివారు కాబట్టి, కానీ అల్లుడు గారికి మారు మనువయితే నా కూతురి స్థానం ఏమవుతుంది ఈ ఇంట్లో. అలాంటి ఆలోచన మానుకోండి అన్నయ్యగారు అంటూ ఏడుపు దిగమ్రింగుకుంటూ ప్రాధేయపడ సాగింది లీలావతి. అది చూస్తున్న స్వప్న దుఃఖం రెట్టింపు అయింది. వెక్కిళ్ళు పెట్టి మరీ ఏడవసాగింది స్వప్న. స్వప్న పరిస్థితి చూస్తున్న సుధీర్‌కి ముఖంలో నెత్తురు చుక్కలేదు. ఏం చేయాలో పాలుపోవడంలేదు. చూస్తూ నిలబడిపోయాడు.

ఇంతలో రహస్య విచారణ జరుపుతున్న ప్రభుత్వ ఆసుపత్రి ప్రసూతి విభాగం సిబ్బంది అక్కడికి వచ్చారు. విషయం అడిగి తెలుసుకున్నారు. స్వప్నని ఓదార్చారు. సుధీర్‌కి ధైర్యం చెప్పారు. పెద్దవాళ్ళందర్నీ చివాట్లు పెట్టి అందరినీ వేరే హాస్పటల్‌కి తీసుకువెళ్లారు.

ఏ దేవుడోవచ్చి అడ్డుపడి తన కాపురం నిలబెడుతున్నట్లనిపించింది స్వప్నకి. స్వప్న తల్లి లీలావతి కనపడని ముక్కోటి దేవతలకి దణ్ణాలు పెడుతున్నది. సుధీర్ భార్య స్వప్న వంక మన ప్రేమ పవిత్రమైందన్నట్లు చూశాడు. పెద్దలందరూ తమ తప్పు లేకపోయినా తప్పు చేసినట్లుగా భావించి బాధపడుతున్నారు.

ఈ లోగా ప్రసూతి విభాగం డాక్టర్ శ్రీమతి ఉదయలక్ష్మి స్వప్నని పరీక్ష చేసి స్వప్నని వారి దగ్గరకు తీసుకువచ్చింది. వాళ్ళందరితోను శుభ వార్త చెప్పింది. దయచేసి మీరందరూ ఏ బాధాపడవద్దు. మీ అమ్మాయికి ఏ సమస్యాలేదు చక్కగా ఉంది ఆమె ఆరోగ్యం. మరో తొమ్మిది నెలల్లో 'సారి' మరో ఏడు నెలల్లో మీ అందరికీ ఒక బుల్లిపాపాయిని ఇస్తుంది. అంతేకాదు.

అక్కడ డాక్టరు చెప్పింది అంతా అబద్ధం. ఒక స్త్రీ శరీరంలో ముఖ్యమైన అవయవాల్లో అత్యంత ప్రధానమైంది గర్భసంచి. అది లేకపోతే స్త్రీ మాతృత్వ మాధుర్యాన్ని పొందలేదు. కానీ నేడు కొంతమంది వైద్యులు ఒక మహిళ గర్భసంచిని డబ్బు సంచిగా భావిస్తున్నారు. ఆపరేషన్ చేసి గర్భసంచి తీసి పారేస్తే గుట్టలు గుట్టలుగా డబ్బుసంచులు వచ్చిపడతాయని 22 ఏళ్లుదాటని వివాహిత స్త్రీలకి కూడా గర్భసంచి తొలగింపు చర్యలు చేస్తున్నారు. ఆ గర్భసంచులే వారిని యమపాశాల్లా వెంటాడుతుయని తెలుసుకోలేక పోతున్నారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ముప్ఫై సంవత్సరాలు దాటి గర్భసంచి క్యాన్సర్ సోకే అవకాశం ఉన్న మహిళకు మాత్రమే గర్భసంచి ఆపరేషన్, తొలగింపు చేయాలని ఆరోగ్యశ్రీ పథకంలో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ఈ ఆపరేషన్ చేసినందుకు ప్రభుత్వం చెల్లిస్తున్న 30 వేలకు కొందరు వైద్యులు కక్కుర్తి పడుతున్నారు. వీరు ఇష్టారాజ్యంగా ఆపరేషన్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. ప్రభుత్వం వారు ఈ అక్రమాల్ని అణచివేయడానికి ఎన్నో పరిష్కార కార్యక్రమాల్ని చేపట్టారు. అందువల్ల మీ పిల్లలకి పరీక్ష చేసిన డాక్టర్లు ఇలాంటి సమస్యను చెప్పినట్లయితే వెంటనే అమలు పరచక మరోసారి మరో డాక్టరుకి చూపించడం ఎంతో అవసరం లేకుంటే కొన్ని కాపురాలే కూలి పోతాయి. మేము సమయానికి రాకపోయి వుంటే మీ కోడలి జీవితం నాశనమైపోయేది. అందుకని ఒకటికి పదిసార్లు ఆలోచించి మరీ ముందడుగు వేయండి. అని డాక్టర్ ఉదయలక్ష్మి అక్కడున్న వారందర్నీ ఉద్దేశించి చెప్పింది. అందరూ ఆనందంగా ఆమెపై నమస్కారాల వర్షం కురిపించారు.

'సరే! మీరందరూ ఇంటికి వెళ్ళి వేడివేడిగా సేమ్యా పాయసంచేసి ఆరగిస్తూ వుండండి. నేను ఆ డాక్టర్ బలిచక్రి వద్దకు వెళ్ళి నాయనా డాక్టరుగారు ఆనాటి బలిచక్రవర్తి దానం ఇచ్చాడు. ఈ నాడు నువ్వు ఆ పేరుని స్టైలుగా పెట్టుకొని పని ప్రాణాల్ని, అమాయక స్త్రీలని బలి తీసుకోవద్దు. సృష్టిని వృద్ధిచేయాల్సిన డాక్టరువి నువ్వు సృష్టిని ఆపద్దు అని గట్టిగా చెప్పి వస్తాను అంటూ గబగబా వెళ్లిపోయారు వెంకట రామయ్య గారు.

ఆయన మాటలకి అందరూ హాయిగా నవ్వుకున్నారు.



డా॥కత్తి పద్మారావు రచించిన 'ఆత్మగౌరవ స్వరం' ఆవిష్కరణ సభలో అప్పికట్ల భరత్‌భూషణ్, ప్రవీణ్ కుమార్, డా॥అంగులకుర్తి విద్యాసాగర్, డా॥మల్లు రవి, బి.యస్.రాములు, ఆచార్య కొలకలూరి ఇనాక్, డా॥కత్తి పద్మారావు, సతీష్‌చంద్ర, ఆచార్య శిఖామణి, బైస దేవదాసు పాల్గొన్నారు.